# సాక్షి
## భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం। 10। సెప్టెంబర్। 2024






**పరిహారంలో అక్రమాలు !**

పెదవాగు వరదతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లింపులో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వస్తున్నాయి. 8లో



**'మేడికుంట'కు మరమ్మతులు**

భారీ వర్షాలతో జూలూరుపాడు మండలం గుండెపుడి మేడికుంట చెరువు కట్ట లీకేజీ కాగా మరమ్మతు పనులు చేస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం 30° / 24°

**వాతావరణం**

జిల్లాలో మంగళవారం వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత కొన్ని ప్రాంతాల్లో జల్లులు పడే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

### 28న జాతీయ లోక్ అదాలత్



కొత్తగూడెంటౌన్: ఈనెల 28న జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏమైనా కేసులు ఉంటే ఇందులో రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు. ప్రమాద, సివిల్ కేసులు, చీటింగ్, చిట్‌ఫండ్, భూతగాదాలు, వివాహ బంధం, చోరీ, ట్రాఫిక్ చలానా, డ్రంక్ అండ్ డ్రైవ్, కుటుంబ తగాదాలు, బ్యాంకు, టెలిఫోన్, ఘర్షణ, సైబర్ క్రైం కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. కక్షిదారులు కోర్టు చుట్టూ తిరుగుతూ తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### ఏఐటీయూసీకి 'గుర్తింపు' పత్రం



ఎమ్మెల్యే కూనంనేని తదితరులకు గుర్తింపు పత్రం అందిస్తున్న సీఎండీ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరిగిన ఎనమిది నెలల తర్వాత యాజమాన్యం ఎట్టకేలకు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రతినిధులకు సోమవారం గుర్తింపు పత్రం అందజేసింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్‌కు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ అందజేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం గుర్తింపుపత్రం ఇవ్వడంతో బాధ్యత తీరినట్టు కాదని, కార్మికుల సమస్యల పరిష్కారానికి గుర్తింపు సంఘంతో అన్నిస్థాయిల్లో సమావేశాలు ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు వైవీఎల్ రావు, ఎల్. ప్రకాశ్, కె.స్వామి, కందుకూరి రాజారత్నం, ఆరెల్లి పోషం తదితరులు పాల్గొన్నారు. అలాగే ఐఎన్‌టీయూసీకి ప్రాతినిధ్య సంఘం హోదా కల్పిస్తూ యూనియన్ సెక్రటరీ జనక్‌ప్రసాద్‌కు ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు నరసింహారెడ్డి, ధర్మపురి, త్యాగరాజన్, ఎండీ రజాక్, పీతాంబరం తదితరులు పాల్గొన్నారు.

### కొలంబియా టూర్‌కు డైరెక్టర్(పా)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్ అండ్ పా) ఎన్.వి.కె. శ్రీనివాస్ పది రోజుల టూర్ నిమిత్తం ఫారిన్ (కొలంబియా) వెళ్లనున్నారు. అక్కడ జరుగనున్న రెస్క్యూ కాంపిటేషన్‌లో సింగరేణి టీమ్ పాల్గొంటుండగా వారితో శ్రీనివాస్ కూడా వెళ్తున్నారు. అయితే ఈ పది రోజుల పాటు కంపెనీ కార్యకలాపాల బాధ్యతలు ఎవరికి అప్పగిస్తారనే అంశంపై చర్చ జరుగుతోంది. కాగా, శ్రీనివాస్ పనితీరుపై వివిధ పార్టీల, కార్మిక సంఘాల నాయకులు ఇటీవల సీఎండీకి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆయన తిరిగి వచ్చాక యథావిధిగా కొనసాగిస్తారా, మారుస్తారా అనే చర్చ కూడా జోరుగా సాగుతోంది.

# తెల్లం కేసులో కీలక మలుపు





గత ఆరేడు నెలలుగా ఊగిసలాడుతూ వస్తున్న భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుపై అనర్హత అంశం కేసు కీలక మలుపు తీసుకుంది. వెంకట్రావుతో పాటు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై నాలుగు వారాల్లోగా తగు నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు సూచించింది. దీంతో తెల్లంపై అనర్హత వేటు పడుతుందా ? తీర్పు అమలుకు ఏమైనా సాంకేతిక అంశాలు అడ్డుగా ఉన్నాయా, అనర్హత వేటు పడిన ఎమ్మెల్యేలు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయిస్తారా లేక సర్వోన్నత న్యాయస్థానం మెట్లు ఎక్కుతారా అనే అంశాలపై చర్చ జరుగుతోంది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

- బీఆర్‌ఎస్ తరఫున భద్రాచలం నుంచి గెలిచిన వెంకట్రావు
- 100 రోజుల్లోపే ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లోకి..
- ఆయనపై అనర్హత వేటు వేయాలంటూ కోర్టుకెక్కిన గులాబీ దళం
- 'అనర్హత'పై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలన్న న్యాయస్థానం

**అటు.. ఇటు..**

2023 నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ తెల్లం వెంకట్రావు భద్రాచలం స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా గెలుపొందారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలు ఉండగా అందులో భద్రాచలం ఒక్కటే బీఆర్‌ఎస్ ఖాతాలో పడింది. మరోవైపు వెంకట్రావుకు రాజకీయ గురువుగా ఉన్న పొంగులేటి రాష్ట్ర కేబినెట్‌లో చోటు దక్కించుకున్నారు. ఈ క్రమంలో ఎన్నికల ఫలితాలు వెలువడిన 100 రోజుల లోపే తెల్లం కారు పార్టీని వీడి హస్తం గూటికి చేరుకున్నారు. దీంతో ఆయనపై అనర్హత వేటు వేయాలని బీఆర్‌ఎస్ పార్టీ అసెంబ్లీ స్పీకర్ జి. ప్రసాద్‌ను కోరింది. మరోవైపు హై కోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేసింది. హై కోర్టు తీర్పు నేపథ్యంలో మరో నాలుగు వారాల్లో స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారనే అంశంపై ఉత్కంఠ నెలకొంది.

**గతంలో వనమాపై..**

గత ప్రభుత్వ హయంలోనూ ఎమ్మెల్యేపై అనర్హత అంశం జిల్లాలో కీలకంగా మారింది. 2018 ఎన్నికల సమయంలో కొత్తగూడెం స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వనమా వెంకటేశ్వరరావు అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారంటూ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన జలగం వెంకట్రావు 2019 జనవరిలో హై కోర్టులో కేసు వేశారు. దీనిపై సుదీర్ఘ విచారణ కొనసాగిన అనంతరం 2023 జూలైలో వనమా ఎన్నికల చెల్లదంటూ హైకోర్టు తీర్పు చెప్పింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ అంశం సంచలనంగా మారింది. అయితే తన అనర్హతపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై వనమా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హై కోర్టు తీర్పుపై స్టే ఇచ్చిన సుప్రీంకోర్టు ఈ కేసు విచారణ చేపట్టింది. అయితే తీర్పు రాకముందే 2023 నవంబర్‌లో ఎన్నికలు జరగడం.. ఆ ఎన్నికల్లో వనమా, జలగం ఇద్దరూ ఓడిపోవడంతో ఈ అంశం మరుగున పడింది.

● 1989లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి కోనేరు నాగేశ్వరరావుపై కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన వనమా వెంకటేశ్వరరావు 247 ఓట్లతో గెలుపొందారు. ఈ గెలుపుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అప్పట్లో కోనేరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై రెండేళ్లపాటు వాదోపవాదాలు జరిగినా కోనేరు నాగేశ్వరరావుకు ఆశించిన ఫలితం దక్కలేదు.

**పదేళ్ల ప్రస్థానం..**

ఏజెన్సీ ప్రాంతంలో మంచి వైద్యుడిగా తెల్లం వెంకట్రావుకు పేరుంది. రాష్ట్ర విభజనకు ముందు 2014లో జరిగిన జమిలీ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున పోటీచేసి ఓడిపోయారు. ఆయన రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన నాటి నుంచి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడిగానే ఉన్నారు. ఆ తర్వాత మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పొంగులేటితో పాటు బీఆర్‌ఎస్‌లో చేరి 2018లో భద్రాచలం అసెంబ్లీ స్థానం నుంచి ఆ పార్టీ తరఫున పోటీ చేసి అపజయం పాలయ్యారు. అయితే 2023 ఆరంభంలో బీఆర్‌ఎస్‌పై తిరుగుబాటు చేసిన పొంగులేటి వెంటే నడుస్తూ తెల్లం కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అనూహ్యంగా అదే ఏడాది ఆగస్టులో తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరి భద్రాచలం టికెట్ దక్కించుకున్నారు.

# తెలంగాణ తొలిపొద్దు 'కాళోజీ'

- ఐటీడీఏ పీఓ రాహుల్ నివాళి
- కలెక్టరేట్‌లోనూ జయంతి వేడుకలు



కాళోజీ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం/సూపర్‌బజార్(కొత్తగూడెం) : తెలంగాణ తొలిపొద్దు, తెలంగాణ వాదాన్ని తన కలంలో చూపించిన మహోన్నత వ్యక్తి కాళోజి నారాయణరావు అని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఘనంగా నివాళులర్పించారు. కాళోజి జయంతి సందర్భంగా సోమవారం ఐటీడీఏలో ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి మార్గం అందరికీ ఆచరణీయమని అన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆయన కవితలు మార్గదర్శకంగా మారాయన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన వేడుకల్లో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ మాట్లాడుతూ.. 'హింస తప్పు, రాజ్యహింస మరీ తప్పు, సామాన్యుడే నా దేవుడు' అని ప్రకటించిన మహనీయుడు కాళోజి అని కొనియాడారు. ఉమ్మడి ఏపీ శాసనమండలి సభ్యుడిగా, ఆంధ్ర సారస్వత పరిషత్ వ్యవస్థాపక సభ్యుడిగా, సాహిత్య అకాడమీ సభ్యుడిగా, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడిగా, గ్లోసరీ కమిటీ సభ్యుడిగా సేవలందించారని వివరించారు. బతుకంతా తెలంగాణ కోసమే అర్పించిన అక్షర తపస్వి అని కీర్తించారు. కాళోజీ జయంతి రోజైన సెప్టెంబర్ 9ని తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించిందని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో బీసీ సంక్షేమాధికారి ఇందిర, కలెక్టరేట్ ఏఓ గన్యా, డీఏఓ వి.బాబూరావు, ఉద్యాన శాఖాధికారి సూర్యనారాయణ, డీసీఓ సయ్యద్ ఖుర్షిద్, ఉప కోశాధికారి వెంకటేశ్వర్లు, ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, గురుకులం ఆర్‌సీఓ నాగార్జున రావు, గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ, ఏసీఎంఓ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ పెరుగుతున్న గోదావరి



భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం ఇలా..

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం సోమవారం ఉదయం నుంచి మళ్లీ పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో ఉన్న ప్రాజెక్టులకు వరద నీరు పోటెత్తడంతో దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండగా ఆ నీరంతా గోదావరిలోకి చేరి వరద ఉధృతి పెరుగుతోంది. సోమవారం ఉదయం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 25 అడుగులు ఉండగా, రాత్రికి 32 అడుగులకు చేరుకుంది. గోదావరి ఉప నదులైన ప్రాణహిత, ఇంద్రావతి, తాలిపేరు పరవళ్లు తొక్కుతుండడంతో భద్రాచలం వద్ద నీటి మట్టం మరిత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

# ముగ్గురు ఎమ్మెల్యేలకు స్థానం

- అసెంబ్లీ అంచనాల కమిటీలో సభ్యులుగా రాందాస్, కనకయ్య
- ప్రజాపద్దుల కమిటీలో కూనంనేనికి చోటు



కోరం కనకయ్య



కూనంనేని



రాందాస్ నాయక్

ఇల్లెందు/వైరా: శాసనసభ ప్రకటించిన మూడు కమిటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలకు స్థానం దక్కింది. ఈ మేరకు సోమవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నేతృత్వాన నియమించిన ఈ కమిటీల వివరాలను అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులు విడుదల చేశారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ(పీఏసీ), ఎస్టిమేట్స్ కమిటీ(అంచనాల కమిటీ), పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీలను ప్రకటించగా ఇందులో పబ్లిక్ అకౌంట్స్ కమిటీలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సభ్యుడిగా నియమితులయ్యారు. అలాగే, అంచనాల కమిటీలో ఇల్లెందు, వైరా ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, మాలోతు రాందాస్‌నాయక్‌కు అవకాశం దక్కింది. ఒక్కో కమిటీలో 12మంది సభ్యులు ఉండగా ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురికి స్థానం దక్కడం విశేషం. కాగా, అంచనాల కమిటీలో తనకు సభ్యుడిగా అవకాశం కల్పించడంపై వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. వైరా నియోజకవర్గం ఏర్పడ్డాక నాలుగో సారి జరిగిన ఎన్నికల్లో రాందాస్ 33వేల పైచిలుకు మెజార్టీతో గెలవగా, అసెంబ్లీ అంచనాల కమిటీ సభ్యుడిగా ఇక్కడి ఎమ్మెల్యేకు అవకాశం రావడం ఇదే తొలిసారి.

### రేపు రాష్ట్ర ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మంగళవారం నిర్వహించే రాష్ట్ర ప్రజా వాణి కార్యక్రమాన్ని ఈ వారం 11వ తేదీన నిర్వహిస్తోందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బేగంపేటలోని మహా త్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో రాష్ట్రస్థాయి ప్రజావాణి నిర్వహించేదని, ఈ మంగళవారం కేంద్ర ఆర్థిక సంఘం సభ్యులతో ప్రజా భవన్‌లో ముఖ్యమైన సమావేశం ఉండడంతో ప్రజావాణి కార్యక్రమాన్ని బుధవారానికి వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

### అప్రెంటిస్ మేళాకు 120 మంది

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ప్రభుత్వ ఐటీఐలో సోమవారం ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్ మేళా నిర్వహించగా జిల్లా నలుమూలల నుంచి 120 మంది అభ్యర్థులు హాజరయ్యారు. టాటా ప్రీమియర్ ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్, హైడ్రోల్ ఎలక్ట్రికల్ కంపెనీలతో పాటు ఆర్టీసీ, సింగరేణి అధికారులు పాల్గొన్నారు. కాగా, అప్రెంటిస్ మేళాకు ఎంపికైన వారి వివరాలను అధికారులు వెల్లడించలేదు.

# యూడైస్ ప్లస్ డేటా నమోదు చేయాలి




మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో యూ డైస్ ప్లస్ డేటాను విధిగా నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరా చారి అన్నారు. పాత కొత్తగూడెంలోని ఆనందఖని ప్రభుత్వ పాఠశాలలో జిల్లా ప్లానింగ్ కో–ఆర్డినేటర్ నగిన సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం అన్ని మండలాల నోడల్ అధికారులు, కో–ఆర్డినేటర్లకు వర్క్‌షాప్ నిర్వహించారు. యూడైస్ ప్లస్ ఉన్న పాఠశాలల, ఉపాధ్యాయుల, విద్యార్థుల వివరాలు ఎలా అప్‌డేట్ చేయాలనే అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ.. ఎంఈఓల ఆధ్వర్యంలో మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాజరయ్యేలా చూడాలని సూచించారు. ముందుగా టెక్నికల్ ఇన్‌చార్జ్ మోహన్, ఏపీఓ రాజేష్ డేటా ఎంట్రీపై అవగాహన కల్పించారు. ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి ఎస్‌కే. సైదులు, ఏపీఓ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# తాలిపేరుకు పెరిగిన వరద ఉధృతి

24 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల



తాలిపేరు నుంచి విడుదలవుతున్న వరద

చర్ల: మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు వరద చేరుతుండగా 25 గేట్లలో 24 గేట్లను పూర్తిగా ఎత్తి 1,54,808 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో తాలిపేరు నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 74 మీటర్లు కాగా వరద ఉధృతి నేపథ్యాన 72.81 మీటర్లుగా నీటిమట్టాన్ని క్రమబద్ధీకరిస్తున్నారు. కాగా, వరద మరింత పెరిగే అవకాశం ఉన్నందున నదికి ఇరువైపులా పెదమిడిసిలేరు, బి.కొత్తూరు, ఆంజనేయపురం, దోశిళ్లపల్లి, భూములంక, గుంపెన్నగూడెం, తేగడ, దండుపేట, ఎర్రగడ్డ తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఈ తిరుపతి సూచించారు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లోకి 1,60,782 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని తెలిపారు.

**కిన్నెరసాని ప్రాజెక్టుకు..**

పాల్వంచరూరల్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షానికి పాల్వంచ మండలం కిన్నెరసాని జలాశయానికి వరద కొనసాగుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 6వేల క్యూసెక్కుల వరద చేరుతుండగా నీటిమట్టం సోమవారం 404.90 అడుగులుగా నమోదైంది. దీంతో రెండు గేట్లను ఎత్తి 8వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

# మందు బిళ్లల్లేవ్..!

- ప్రభుత్వాస్పత్రిలో మందుల కొరత
- ఇబ్బందులు పడుతున్న జ్వర బాధితులు
- స్థానిక కొనుగోలుకు కలెక్టర్ అనుమతి కోసం ఎదురుచూపులు



జిల్లా సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు (ఫైల్)

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని సర్వజన, ఎంసీహెచ్ ఆస్పత్రుల్లో మందుల కొరత ఏర్పడింది. మరోవైపు విషజ్వరాల బారిన పడుతున్నవారి సంఖ్య రోజుకురోజుకూ పెరుగుతోంది. ఆస్పత్రికి వచ్చినా మాత్రలు లేని కారణంగా జ్వరాలు తగ్గడం లేదు. దీంతో రోగులు అవస్థ పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో 230 పడకలు ఉన్నాయి. ఇక్కడ రోజూ 800 నుంచి 1000 వరకు ఓపీ నమోదవుతోంది. సుమారు 400 మందికి పైగా జ్వరపీడితులు ఉంటున్నారు. రోజూ 75 మంది వరకు ఆస్పత్రిలో అడ్మిట్ అవుతున్నారు. సీజనల్ వ్యాధుల వచ్చే కాలం కావటంతో విషజ్వరాలతో అనేక మంది ప్రభుత్వాస్పత్రికి వస్తున్నారు. కానీ మందులు అందుబాటులోలేవు. జ్వరానికి అవసరమయ్యే యాంటీబయాటిక్స్ మాత్రలు టాగ్‌జీమ్, అజిత్రోమేషన్, మల్టీవిటమిన్ ట్లాబెట్‌లు, పారసిటమాల్ ఇంజెక్షన్, పారాసిటమాల్ ఇన్‌ఫ్యూజన్ కొరత ఉంది. జ్వర బాధితులకు ఒళ్లు నొప్పులు వస్తున్నాయి. కానీ నొప్పి నివారణకు ఉపయోగించే డైక్లో ఇంజెక్షన్, గ్యాస్ సమస్యలకు ప్యాంటాప్ ఇంజెక్షన్లు అందుబాటులో లేవు. దీంతో రోగులు అవస్థ పడుతున్నారు. ఆస్పత్రి అధికారులు స్థానికంగా మందులు కొనుగోలు చేసేందుకు కలెక్టర్ అనుమతి కోసం ఎదురుచూస్తున్నారు. మందులు సరిపోక, నిధుల లేమితో ఆస్పత్రి నిర్వహణపై అధికారులు తలలు పట్టుకుంటున్నారు

**1,142 మందికి విష జ్వరాలు**

జిల్లా సర్వజన ఆస్పత్రిలో 1,142 మందికి విష జ్వరాలు సోకాయని, డెంగీ ఫీవర్ 54 మంది, మలేరియా 25 మందికి వచ్చినట్లు రికార్డులు చెబుతున్నాయి. కానీ రోజూ 800 నుంచి 1000 వరకు ఓపీ నమోదవుతున్న నేపథ్యంలో చాలా మందికి విష జ్వరాలు సోకినట్లు తెలుస్తోంది. ల్యాబ్‌లో సైతం కెమికల్స్ లేనట్లు సమాచారం. దీంతో రక్త పరీక్షలు చేసేవారు కూడా ఇబ్బందులు పడుతున్నారు.

**మాతా శిశు సంరక్షణ కేంద్రంలో..**

రామవరంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో 150 పడకలు ఉన్నాయి. ఇక్కడికి జిల్లా నలుమూలల నుంచి పేషెంట్లు వస్తుండగా, 200 నుంచి 400 వరకు ఓపీ నమోదవుతోంది. గర్భిణులకు జ్వరం వచ్చినా, నొప్పులు వచ్చినా వారికి మందులు కొరత కారణంగా వైద్యం పూర్తిస్థాయిలో అందడం లేదు. తెలంగాణ రాష్ట్ర మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలమెంట్ కార్పొరేషన్ నుంచి సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్ ద్వారా ప్రతీ ఆస్పత్రికి మందులు సరఫరా చేస్తారు. అయితే బిల్లులు రూ. కోట్లలో పేరుకుపోవడంతో ఏజెన్సీల నిర్వాహకులు మందుల సరఫరాకు వెనుకంజ వేస్తున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తింది. స్థానికంగా కొనుగోలు చేద్దామన్నా నిధులు లేవు.

**సమస్యలు పరిష్కరిస్తాం**



జిల్లా సర్వజన, ఎంసీహెచ్ ఆస్పత్రుల్లో సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తాం. విష జ్వరాలు సోకినవారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. మందుల కొరత తీర్చేందుకు స్థానికంగా మందుల కొనుగోలుకు కలెక్టర్ అనుమతి కోసం ప్రయత్నిస్తున్నాం. ఆస్పత్రిలో రోగులకు అవసరమయ్యే మందులు అందిస్తాం.

– రాజ్‌కుమార్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్

# అభివృద్ధికి దూరంగా సీ గ్రేడ్ మున్సిపాలిటీలు



16వ ఆర్థిక సంఘం సమావేశంలో మున్సిపల్ చైర్మన్ డీవీ

ఇల్లెందు: 16వ ఆర్థిక సంఘం నిధులు జనాభా ఆధారంగా కేటాయిస్తుండడంతో సీ గ్రేడ్ మున్సిపాలిటీలు అభివృద్ధికి దూరంగా ఉంటున్నాయని ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జాతీయ 16వ ఆర్థిక సంఘం ప్రతినిధుల సమావేశం సోమవారం నిర్వహించగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఆయన హాజరై మాట్లాడారు. ఇల్లెందు మున్సిపాలిటీ సింగరేణి ప్రభావిత ప్రాంత పరిధిలో ఉండడంతో భూములన్నీ సింగరేణి లీజులోనే ఉన్నాయని, మున్సిపాలిటీకి ఇంటి ఆస్తి, భూములపై ఆదాయం లభించే అవకాశం లేదని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. మున్సిపాలిటీకి పన్నుల ద్వారా వచ్చే ఆదాయం సిబ్బంది వేతనాలకు కూడా సరిపోవడం లేదని, జనాభా ప్రాతిపదికన ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తే తీవ్రంగా నష్టపోతామని వివరించారు. అనంతరం మున్సిపల్ సీడీఎంఏ వీ.పీ. గౌతమ్‌ను కలిసి చిన్న మున్సిపాలిటీల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు జీత భత్యాలు చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్నామని వివరించారు. ఇందుకోసం ప్రత్యేక నిధులు విడుదల చేయాలని వినతిపత్రం అందజేశారు.

## క్లుప్తంగా

### రామాలయ రిటైర్డ్ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి ఆలయ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో గౌరవ అధ్యక్షుడిగా పొడిచేటి రామచంద్రాచార్యులు, అధ్యక్షుడిగా పొట్టాబత్తుల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా మల్లంపల్లి పాండు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కీర్తి రమేష్, కార్యదర్శిగా జీవీఎస్.సీతారామాచార్యులు, కోశాధికారిగా నాగేశ్వరరావు, కన్వీనర్‌గా సుబ్బారావుతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకోగా.. సంఘం తరఫున సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.20 వేలు విరాళంగా ఇవ్వాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సీతారామచంద్రాచార్యులు, రామకృష్ణంరాజు, భుజంగరావు, సత్యనారాయణ, రామకృష్ణ బాబు, నరసింహాచార్యులు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


### ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని రైతు బజార్ వద్ద ఎయిడ్స్ నిర్మూలనపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి భాస్కర్ నాయక్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండలన్నారు. ఎయిడ్స్ రహిత సమాజ స్థాపన కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి కళ్యాణ్, డాక్టర్ రాజేంద్రప్రసాద్, కావేరి తదితరులు పాల్గొన్నారు.

### వర్షంతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం

పూర్తిగా నిలిచిపోయిన ఓబీ వెలికితీత


పీకే ఓసీ-4లో నిలిచిన వర్షపు నీరు

మణుగూరు టౌన్: వారంరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం సింగరేణి మణుగూరు ఏరియాలోని పీకేఓసీ, మణుగూరు ఓసీలలో బొగ్గు ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపింది. బొగ్గు వెలికితీతకు ఆటంకం ఏర్పడగా, ఓబీ వెలికితీత కూడా పూర్తిగా నిలిచిపోయిందని అధికారులు పేర్కొంటున్నారు. మణుగూరు ఏరియాలో ఈ నెలలో లక్షా 20 వేల టన్నుల బొగ్గు, 20 లక్షల క్యూబిక్ మీటర్ల మేర ఓబీ వెలికితీతకు అంతరాయం ఏర్పడింది. ఈ నెలలో ఇప్పటివరకు 205 మి.మీటర్ల వర్షపాతం నమోదు కావడంతో పీకేఓసీ నుంచి 5 పంపుల ద్వారా, మణుగూరు ఓసీ నుంచి 2 పంపుల ద్వారా నీటిని బయటకు తోడుతున్నారు. అధికారులు ఉత్పత్తి పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్ష ప్రభావం బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగిస్తోంది.

### వరద బాధితులకు రూ.10 లక్షల విరాళం

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు వరదతో దెబ్బతిన్న బాధితులకు తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ.10 లక్షల సాయం ప్రకటించారు. ఖమ్మంలో మున్నేరు వరదల కారణంగా దెబ్బతిన్న వారిని ఆదుకోవాలన్న రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపుతో భద్రాద్రి జిల్లా ఇరవెండి గ్రామానికి చెందిన తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ.10 లక్షలు అందజేయన్నట్లు తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్ తెలిపారు. ఈ నిధులతో వరద ప్రాంతాల్లో విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాలతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన సహాయక కార్యక్రమాలు చేపడుతామని వెల్లడించారు.

### క్రీడల్లో రాణించాలి


మాట్లాడుతున్న జీఎం సుధాకర్

సింగరేణి(కొత్తగూడెం): కార్మికులు క్రీడల్లో రాణించాలని సింగరేణి జీఎం (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) సామ్యేల్ సుధాకర్ సూచించారు. కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు ఆరోగ్యానికి దోహదపడతాయని అన్నారు. నైపుణ్యం పెంచుకుని కోలిండియా స్థాయిలో పతకాలు సాధించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు కోడూరు శ్రీనివాస్‌రావు, ఆర్.కేశవరావు, టీ.శ్రీనివాసరావు, ఏపీ రమేష్, వాలీబాల్ కెప్టెన్ రాజశేఖర్, యూనియన్ నాయకులు నితిన్‌కుమార్, సీహెచ్ మహేష్ పాల్గొన్నారు.

### పామాయిల్ గెలలు



| | |
|---|---|
| టన్ను ధర | రూ.14,392 |

# పరిహారంలో... 'అధికార' పరివారం!


పెదవాగు వరద ముంపు కారణంగా వరి పొలంలో భారీగా పేరుకుపోయిన ఇసుక మేటలు

- వరద ముంపుతో తీవ్రంగా దెబ్బతిన్న పంటలు
- పరిహారం జాబితాలో నష్టపోయిన రైతుల పేర్లు మాయం
- రూ. లక్షలు కాజేసిన అధికార పార్టీ నేతల బంధువులు
- ఆవేదన చెందుతున్న పెదవాగు ప్రాజెక్ట్ బాధిత రైతులు

అశ్వారావుపేటరూరల్: వరద ముంపు నష్టపరిహారంలో భారీగా అక్రమాలు జరిగాయి. పంట నష్టపోయిన రైతుల పేర్లు పరిహారం జాబితాలో మాయంకాగా, అధికార పార్టీవారికి బంధువులకు అగ్రతాంబులం వేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. జాబితాలో నకిలీ పేర్లు నమోదు కాగా, నిజమైన లబ్ధిదారులు పరిహారానికి నోచుకోలేదు.

**జూలై 18న పోటెత్తిన వరద**

అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్దగల పెదవాగు ప్రాజెక్టుకు గత జూలై 18న భారీగా వరద పోటెత్తింది. దీంతో ప్రధాన ఆనకట్టకు 250 మీటర్ల దాకా భారీగా గండ్లు పడిన సంగతి తెలిసిందే. పెదవాగు ఉప్పొంగి ప్రాజెక్ట్‌కు గండ్లు పడటంతో పంటలు వరద పాలయ్యాయి. ప్రాజెక్టు గండ్లు, పెదవాగు ప్రభావంతో దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం ఎకరాకు రూ.10,418 చొప్పున నష్ట పరిహారాన్ని ప్రకటించింది.

**391.19 ఎకరాల్లో పంట నష్టం**

పెదవాగు ముంపు కారణంగా నష్టపోయిన పంటల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు సర్వే చేసి నమోదు చేశారు. అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి, నారాయణపురం, కొత్తూరు, బచ్చువారిగూడెం గ్రామాల్లో మొత్తం 363 మంది రైతులకు సంబంధించి 808.39 ఎకరాలకు గాను 391.19 ఎకరాల్లో ఇసుక మేటలు, రాళ్లు, కోతకు గురై పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులు సర్వేలో నిర్ధారించారు. ఈ సర్వేలో అక్రమాలు చోటుచేసుకోగా, రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

**జాబితాలో అనర్హులు**

పరిహారం జాబితాలో నష్టపోయిన రైతుల పేర్లు పెద్ద సంఖ్యలో గల్లంతయ్యాయి. కానీ అధికార పార్టీకి చెందిన ఓ కుటుంబంలో ఏకంగా 14 మంది పేర్లు నమోదు చేశారు. వీరిలో నలుగురికి అసలు భూమే లేదు. అయినా వారిపేర్లను పరిహారం జాబితాలో చేర్చారు. మరికొందరికి సెంటుల్లో నష్టపోతే ఎకరాల్లో నష్టం జరిగినట్లు చూపించారు. ఇలా 42 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ఒకే కుటుంబ పేర్లతో నమోదు చేయడంతో అనర్హులకు పరిహారం మంజూరైంది. దీంతో రూ. లక్షలు పక్కదారి పట్టాయి. గ్రామానికి చెందిన గుంజి రాంబాబు, దేరంగుల కురేష్, దేరంగుల వెంకన్నబాబు, గాలి రమేష్ రెడ్డి, మెడికొండ సుబ్బారావు, తాళ్లూరి అబ్బులు, విజయరామారావు, వల్లెపు వెంకన్నబాబు, దేరంగుల ఆదయ్య, వంటిపల్లి రాము, వీరంకుల అనిల్‌తోపాటు మరో 40 మంది రైతుల పొలాల్లో నష్టం జరగ్గా, ఈ రైతుల పేర్లు పరిహారం జాబితాలోలేవు. ప్రాజెక్ట్ కిందే దెబ్బతిన్న పొలాల రైతులు కూడా జాబితాలో చోటుదక్కలేదు.

**హడావిడిగా సర్వే**

వ్యవసాయశాఖ అధికారులు హడావిడిగా సర్వే చేయడం కూడా అక్రమాలకు అవకాశం కల్పించినటయింది. పంట నష్టంపై తక్షణమే నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించడంతో అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే చేసే సమయం లేకపోయింది. దీంతో గ్రామంలోని ఓ ఆలయం వద్దే సర్వే సిబ్బంది హడావిడిగా రైతుల పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిసింది. దీంతో నష్టపోయిన రైతుల పేర్లకు బదులు నష్టం జరగని రైతుల పేర్లు అధికంగా నమోదైనట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఇసుక, రాళ్లు, రప్పలతో పొలం ఆనవాళ్లు కోల్పోయినా..

ఈ రైతు పేరు వంటిపల్లి రాము. గుమ్మడవల్లి గ్రామం. ఇతనికి పెదవాగు ప్రాజెక్ట్ కింద మూడెకరాల వరి పొలం ఉంది. ఖరీఫ్‌లో వరిసాగు చేపట్టాడు. ఎకరానికి రూ. 17 వేల చొప్పున రూ. 51 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. కానీ వరద ముంపుతో పంట పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. పొలం భారీగా ఇసుక మేటలు వేసి, రాళ్లతో నిండిపోయింది. పంట, పొలం రెండూ కోల్పోయి అన్నదాత మనోవేదనకు గురవుతున్నాడు. అధికారులు వచ్చి సర్వే చేశారు. వివరాలు నమోదు చేసుకున్నారు. దీంతో ఎంతోకొంత పరిహారమైన దక్కితే ఉపశమనం కలుగుతుందని భావించాడు. కానీ నష్టపరిహారం జాబితాలో ఆయన పేరే లేదు. ఇలాగే మరో 50 మంది రైతులు పంటనష్టపోయినా పరిహారానికి నోచుకోలేదు.



### జాబితాలో నా పేరు లేదు



మాది గుమ్మడవల్లి గ్రామం. పెదవాగు ప్రాజెక్టు కిందే మూడెకరాల పొలం ఉంది. వరద ముంపుతో వరి పంట పూర్తిగా కొట్టుకుపోయింది. ఇసుక మేటలు వేయడంతోపాటు పెద్ద పెద్ద రాళ్లతో పొలం ధ్వంసమైంది. సర్వే సమయంలో వివరాలు నమోదు చేశారు. కానీ తీరా చూస్తే జాబితాలో పేరు లేకుండా పోయింది.

–వీరంకుల అనిల్, బాధిత రైతు

### నా దృష్టికి రాలేదు

పెదవాగు ముంపు నష్ట పరిహారంలో అక్రమాలు జరిగినట్లు నా దృష్టి రాలేదు. సర్వే సమయంలో నేను వేరే మండలంలో విధుల్లో ఉన్నందున పూర్తి వివరాలు తెలియదు. నకిలీ పేర్లు, వివరాలు తెలుసుకుని విచారణ నిర్వహిస్తాం.

–శివరాం ప్రసాద్, ఏఓ, అశ్వారావుపేట

# మాఫీ తక్కువ.. ప్రచారం ఎక్కువ

సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య


మాట్లాడుతున్న అన్నవరపు కనకయ్య

అశ్వారావుపేట: కాంగ్రెస్ సర్కార్ గోరంత రుణమాఫీ చేసి కొండంత ప్రచారం చేసుకుంటోందని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య విమర్శించారు. సోమవారం ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 5,07,987 మంది రుణగ్రహీతలకు రూ.415,43,86,322 రద్దు చేయాల్సి ఉండగా, కేవలం 1,88,034 మందికి 23 శాతం మాత్రమే రుణమాఫీ చేశారని ఆరోపించారు. అప్పు ఇచ్చేటప్పుడు లేని షరతులు రుణమాఫీ అమలు చేసేటపుడు ఎందుకని ప్రశ్నించారు. రూ. 2 లక్షల రుణాలను మాఫీ చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించి రూ.2 లక్షలకు మించిన రుణాన్ని చెల్లిస్తే అమలు చేస్తామనటం సరికాదన్నారు. రూ.లక్ష లోపు ఉన్న రుణాలు కూడా రద్దు కాకపోవడం బాధాకరమన్నారు. షరతులు లేని రుణమాఫీకి ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు రావాలని కోరారు. సీపీఎం మండల కమిటీ సభ్యుడు మళ్లగిరి గంగరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొక్కెరపాటి పుల్లయ్య, మండల కన్వీనర్ బుడితి చిరంజీవి నాయుడు, తగరం నిర్మల, కారం సూరిబాబు, మడిపల్లి వెంకటేశ్వరరావు, తుట్టి వీరభద్రం, కుంజా మురళి, కలపాల వీరభద్రం, నారం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్యం మెరుగుపరచాలి


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి

అన్నపురెడ్డిపల్లి: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలని అధికారులను జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి ఆదేశించారు. సోమవారం అన్నపురెడ్డిపల్లి మండలంలోని అబ్బుగూడెం, పెంట్లం, గుంపెన గ్రామ పంచాయతీల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో మురుగునీరు నిల్వ లేకుడా, చెత్తాచెదారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ షబ్నా, పంచాయతీ సెక్రటరీలు గురునాథం, శాంతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల చెంతకు సంక్షేమ పథకాలు


గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న ఏపీఓ డేవిడ్‌రాజ్

భద్రాచలం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన గిరిజనుల చెంతకు చేరేలా అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశం మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ ప్రాంతాల గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం యూనిట్ అధికారులతో సమావేశమైన ఏపీఓ మాట్లాడుతూ అర్హతల మేరకు దరఖాస్తులను పరిష్కరించాలని తెలిపారు. గిరిజనులు సైతం ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, స్వయం ఉపాధి కోసం చిన్న, మధ్యతరహా పరిశ్రమలు స్థాపించాలని చెప్పారు. గురుకులాల ఆర్‌సీఓ నాగార్జున రావు, ఉద్యానవన అధికారి ఉదయ్‌కుమార్, జీసీసీ డీఎం దావీద్‌తోపాటు వివిధ శాఖల అధికారులు భాస్కర్, మునీర్ పాషా, ఆర్.శ్రీనివాస్, ప్రభాకర్‌రావు, ఆదినారాయణ, ప్రభాకర్‌రావు, హరికృష్ణ పాల్గొన్నారు.

# చేపల వల తొలగింపుపై వివాదం

ఇల్లెందురూరల్: మండలంలోని చల్లసముద్రం పెద్ద చెరువు అలుగు వద్ద చేపల వల తొలగింపుపై వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో చల్లసముద్రం పెద్దచెరువు అలుగుపోస్తోంది. మత్తడి నీటితోపాటు చెరువులో పోసిన చేప పిల్లలు బయటకు వెళ్తాయనే ఉద్దేశంతో చేపల పెంపకం సొసైటీ నిర్వాహకులు అలుగు వద్ద వల ఏర్పాటు చేశారు. అయితే చెత్తాచెదారం వలకు అడ్డుపడి అలుగు నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. దీంతో చెరువులో నీటిమట్టం పెరగగా, స్థానికులు ఆందోళనకు గురయ్యారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల సూచనతో చేపల వలను తొలగించారు. వలను తొలగించడంతో పోసిన చేప పిల్లలు బయటకు వెళ్లి, తమకు నష్టం జరిగిందని సొసైటీ సభ్యులు ఆదివారం రాత్రి ఇల్లెందు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ పరిణామం చల్లసముద్రం గ్రామంలో ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామస్తులు కూడా సోమవారం పోలీసులను ఆశ్రయించారు. సీఐ సత్యనారాయణ ఇరువర్గాలతో చర్చించి, అధికారుల సూచన మేరకే వల తొలగించారని సీఐ సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

### దాడి ఘటనలో కేసు నమోదు

ఇల్లెందు: దాడి ఘటనలో ముగ్గురు వ్యక్తులపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన శ్రావణిపై అదే ఏరియాకు చెందిన ముగ్గురు వ్యక్తులు నీలిమ, వెంకటరాములు, శ్రావణి దాడి చేసి గాయపర్చారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపారు.

**చోరీపై..**

ఇల్లెందు: పట్టణంలోని జేకే కాలనీ ఎస్‌డీ 440 క్వార్టర్‌లో రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. ఇంటి యజమాని ధారావత్ తారా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి. సూర్య సోమవారం తెలిపారు.

### రిటైర్డ్ హెచ్‌ఎంకు అవార్డు

జూలూరుపాడు: మండల పరిధిలోని పాపకొల్లు గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరరావుకు జాతీయ స్థాయి విశిష్ట ప్రజ్ఞా అవార్డు అందుకున్నారు. ఈ నెల 8న కరీంనగర్ ఫిలిం భవన్‌లో శ్రీఆర్యాణి సకల కళావేదిక ఆధ్వర్యంలో విశిష్ట ప్రజ్ఞా పురస్కార ప్రదానోత్సవం జరిగింది. విద్యారంగంలో విశేష సేవలు అందించిన రిటైర్డ్ హెచ్‌ఎం డాక్టర్ వెంకటేశ్వరరావును అతిథులు, నిర్వాహకులు సన్మానించి, జాతీయస్థాయి విశిష్ట ప్రజ్ఞా అవార్డు, బంగారు కంకణం, మెమెంటో అందజేశారు. ఈ మేరకు అవార్డు గ్రహీత సోమవారం వివరాలు వెల్లడించారు.

# మేడికుంట చెరువు కట్టకు మరమ్మతులు


తూము పక్కన లీకవుతున్న నీరు


జేసీబీ సాయంతో మరమ్మతులు చేస్తున్న దృశ్యం

జూలూరుపాడు: భారీ వర్షాల కారణంగా గుండెపుడి మేడికుంట చెరువు వరదనీటితో పూర్తిగా నిండిపోయింది. చెరువు కట్ట బలహీనపడి తూము పక్కన లీకేజీ కావడంతో నీరు వృథాగా పోతోంది. కట్టకు గండిపడే ప్రమాదం ఉండగా, గమనించిన రైతులు సోమవారం అధికారులకు సమాచారం ఇచ్చారు. కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, తహసీల్దార్ కె.స్వాతి బిందు, ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, సీఐ ఇంద్రసేనా రెడ్డి, ఎస్ఐ రాణా ప్రతాప్, ఇరిగేషన్ డీఈ కిషోర్, ఏఈ వెన్నెల తదితరులు చెరువు కట్టను సందర్శించి పరిశీలించారు. తూము పక్కన లీకేజీని తాత్కాలికంగా గ్రామస్తులు, రైతులసాయంతో వరిగడ్డి, ఇసుక బస్తాలను వేసి పూడ్చివేశారు. టిప్పర్, ట్రాక్టర్లతో మట్టి తరలించి జేసీబీ సాయంతో లీకేజీ వద్ద కట్టకు మరమ్మతులు చేపట్టారు. కార్యక్రమంలో గిర్దావర్ తిరుపతిరావు, ఎంపీఓ తులసీరామ్, పంచాయతీ సెక్రటరీ రవి, రెవిన్యూ, పోలీస్ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### చెరువులో పడి వ్యక్తి మృతి

దమ్మపేట: గేదెలను మేతకు తోలుకెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం .. పెద్దగొల్లగూడెం గ్రామానికి చెందిన మారుతి వీరబాబు(50) గేదెలను మేత కోసం గ్రామ శివారులోని నల్ల చెరువు సమీపంలోకి తోలుకెళ్లాడు. చెరువులోకి దిగిన గేదెలను బయటకు మళ్లించే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోయాడు. గమనించిన స్థానికులు అతన్ని రక్షించడానికి ప్రయత్నించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

### మద్యం సీజ్

బూర్గంపాడు: పాల్వంచ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ఎటపాకకు అక్రమంగా మద్యం తరలిస్తున్న కారును సోమవారం సారపాకలో పోలీసులు పట్టుకున్నారు. రూ.96 వేల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మద్యం కొనుగోలు చేసిన వ్యక్తిపై, విక్రయించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

### ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు


రోడ్డు పక్కకు దూసుకెళ్లిన లహరి బస్సు

ఏన్కూరు: మండలంలోని గార్లొడ్డు సమీపాన రహదారి పక్కన ఆగిన ట్రాక్టర్ ట్రక్కును సోమవారం ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. మియాపూర్ డిపోకు చెందిన లహరి బస్సు తెల్లవారుజామున 4.30గంటల సమయాన హైదరాబాద్ వెళ్తుండగా మార్గమధ్యలో గార్లొడ్డు వద్ద ట్రక్కును ఢీకొట్టి పక్కకు దూసుకెళ్లింది. ఈ సమయాన బస్సులో 17 మంది ప్రయాణికులు ఉన్నప్పటికీ ఎవరికీ ప్రమాదం జరగలేదు. కాగా, గంటకు పైగా బస్సు రహదారికి అడ్డంగా ఉండడంతో రాకపోకలు నిలిచిపోవడంతో పోలీసులు, స్థానికులు టిప్పర్ ద్వారా పక్కకు తొలగించారు.

### అంత్యక్రియలకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం

కామేపల్లి: బంధువును కడసారి చూసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. మండలంలోని సాతానిగూడేనికి చెందిన బొరిగొర్ల సురేష్ ఆదివారం మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలు సోమవారం జరుగుతుండగా బంధువులైన ఖమ్మంకు చెందిన కట్టబోయిన వెంకటరత్నం – పద్మ దంపతులు బైక్‌పై పండితాపురం వెళ్తున్నారు. ఈక్రమంలో సాతానిగూడేనికి చెందిన యువకుడు ద్విచక్రవాహనంపై ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో వెంకటరత్నంకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు.

### భారీ వర్షానికి కూలిన ఇంటి గోడలు


బొజ్జాయిగూడెంలో కూలిన ఇంటి గోడ

ఇల్లెందురూరల్: వారం రోజులుగా కురిసిన భారీ వర్షానికి మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామంలో చిట్టోజి మోహనచారి ఇంటి గోడలు పూర్తిగా కూలిపోయాయి. భారీ వర్షాలకు నానిన గోడలు సోమవారం ఒక్కసారిగా కూలిపడ్డాయి. స్పందించిన గ్రామస్తులు మోహనచారి కుటుంబానికి తాత్కాలిక ఆశ్రయం కల్పించి ఆదుకున్నారు. రెవెన్యూ అధికారులు కూలిన గోడలను పరిశీలించి పంచనామా నిర్వహించారు.

# వరద బాధితులకు 'రోటరీ' ఆపన్నహస్తం


ధంసలాపురంలో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: భారీ వర్షాలు, వరదతో చిన్నాభిన్నమైన కుటుంబాలకు రోటరీ క్లబ్ అండగా నిలిచింది. మున్నేరు, ఆకేరు పరీవాహక ప్రాంతంలోని ఖమ్మం నగరం, ఖమ్మం రూరల్ మండలంతోపాటు పాలేరు నియోజకవర్గంలో వేలాదిగా ప్రజలు సర్వం కోల్పోయారు. ఈ నేపథ్యాన బాధితులకు చేయూతనిచ్చేందుకు రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం, సెంట్రల్ క్లబ్, ఇన్నర్‌వీల్ అసోసియేషన్ విభాగాలు నడుం బిగించాయి. ఇందులో భాగంగా ఐదు కిలోల బియ్యం, రెండు కిలోల రవ్వ, వంట నూనె, చక్కెర, ఉప్పు, పప్పు, ఉల్లిపాయలు, ఆలుగడ్డలు, సబ్బులతో కూడిన రూ.వెయ్యి విలువైన 2,500 కిట్లను సోమవారం ఖమ్మం రామన్నపేట, ధంసలాపురం తదితర ప్రాంతాల్లో పంపిణీ చేశారు. రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150లోని వివిధ శాఖల ఆర్థిక సాయంతోపాటు స్వచ్ఛద సంస్థల చేయూతతో సమకూరుస్తున్న ఈ కిట్లను మరికొన్ని ప్రాంతాల్లో కూడా పంపిణీ చేస్తామని ప్రతినిధులు తెలిపారు. రోటరీ జిల్లా గవర్నర్ కె.శరత్‌చౌదరి, డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రాంప్రసాద్, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మల్లాది వాసు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రవీంద్రనాథ్, జి.రాంబాబు, హరి శ్రీనివాస్, ఎస్ ప్రవీణ్‌తోపాటు దొడ్డపనేని సాంబశివరావు, పలివెల భూషణ్‌రావు, కె.కొండల్‌రావు, పసుమర్తి రంగారావు, కాళ్ల పాపారావు, ఐ.రామకృష్ణ, కోటేరు వెంకటరెడ్డి, బొడ్డు సుధాకర్, స్వర్ణలత, శరీదేవి, విజేత, కమల, ప్రమీల, జానాబాయి, కవిత పాల్గొన్నారు.

### బధిర మహిళపై అసభ్యకర ప్రవర్తన

నిందితుడిపై కేసు నమోదు

ములకలపల్లి: మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి సమీపంలోని ఓ గ్రామానికి చెందిన బధిర మహిళపై కుంజా అనిల్ అనే వ్యక్తి కొంతకాలంగా అసభ్యకరంగా వ్యవహరిస్తున్నాడు. మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. బాధిత మహిళ కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ నిర్వహిస్తున్నామని ఎస్సై తెలిపారు.

### కేసు నమోదు

ములకలపల్లి: హౌసీ ఆడుతున్న 15 మందిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని వేముకుంట గ్రామశివారులో హౌసీ ఆడుతుండగా పోలీసులు దాడులు నిర్వహించారు. 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. రూ 1,740 నగదు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

పాల్వంచ: మొర్రేడు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను వనమా కాలనీ వద్ద సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్ యజమాని లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.